ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
సోమవారం 29 ఏప్రిల్ 2024

ఎన్నికల ప్రచారానికి భానుడి ఎఫెక్ట్
- ఉదయం వేళల్లోనే ముఖ్య నాయకుల ప్రచారాలు
- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో కనిపించని సందడి
- జిల్లాలో 43.3 గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- కొనసాగుతున్న ఆరెంజ్ అలర్ట్

8లో..

కుట్రల నుంచి తెలంగాణను కాపాడుకోవాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు



వేములవాడలో మాట్లాడుతున్న కేటీఆర్

వేములవాడ, ఏప్రిల్ 28 : బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే లోక్ సభ ఎన్నికల్లో కనీసం 10 నుంచి 12 స్థానాలలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. వేములవాడ నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం వేములవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్‌ను కనీసం పదేళ్లపాటు ఉమ్మడి రాజధాని చేయాలని, కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని బీజేపీ కుట్రలు పన్నుతోందని అన్నారు. తమను 400 సీట్లతో గెలిపిస్తే రాజ్యాంగం మారుస్తామని బీజేపీ నేతలు అంటున్నారని, లోక్‌సభ నియోజకవర్గాల డీలిమిటేషన్ పేరిట దక్షిణాది రాష్ట్రాలలో స్థానాలు తగ్గించి అన్యాయం చేయాలని చూస్తున్నారని, ఇలాంటి కుట్రలు సాగకుండా, తెలంగాణకు అన్యాయం జరగకుండా అడ్డుకునే శక్తి ఒక్క గులాబీ కండువాకే ఉందని స్పష్టం చేశారు. పదేళ్ల కాలంలో నరేంద్ర మోదీ ప్రజలను అనేక విధాలుగా మోసం చేశారన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా విదేశాల నుంచి నల్లధనం తీసుకొస్తానని, ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తానని బడే భాయ్ మోదీ ప్రజలను నమ్మించి మోసం చేసి ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు 2023లో చోటా భాయ్ రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీల పేరుతో తప్పుడు హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారని అన్నారు.

● మనల్ని ఎవరూ ఓడించలేదు.. మనమే ఓడించుకున్నాం..

అసెంబ్లీ ఎన్నికల్లో మనల్ని ప్రజలు ఓడించలేదని, మనల్ని మనమే ఓడించుకున్నామని కేటీఆర్ అన్నారు. నాయకుల మధ్య విభేదాలు, పంచాయతీలతో పార్టీకి తీవ్ర నష్టం జరిగిందని, కేవలం రెండు శాతం ఓట్లతో అధికారం కోల్పోయామని అన్నారు. అధికారం లేకపోవడంతో కార్యకర్తలు, నాయకులు సైతం తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. పంచాయతీలు, పగలు పక్కన బెట్టి, ఎండను లెక్క చేయకుండా కష్టపడి పని చేయాలని కోరారు. వేములవాడ నియోజకవర్గంలో ఉన్నది చెన్నమనేని రమేష్ మనుషులో, చల్మెడ లక్ష్మీ నరసింహారావు మనుషులో కాదని, అందరూ కేసీఆర్ మనుషులేనని అన్నారు. 70 ఏళ్ల వయసులో తుంటి విరిగినా కేసీఆర్ బస్సు యాత్ర పేరిట జనం కోసం తిరుగుతున్నారని, 12ఎంపీ సీట్లు బీఆర్ఎస్‌కు వస్తే కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించేరోజు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

● బండి సంజయ్.. చర్చకు సిద్ధమా?

ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు ఏమీ చేయలేదని, 2014 నుంచి 2019 వరకు ఎంపీగా ఉన్న బోయినపల్లి వినోద్ కుమార్ కృషితోనే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని కేటీఆర్ అన్నారు. మనోహరాబాద్ - కొత్తపల్లి రైలు మార్గం పనులు వేగంగా జరిగి సిద్దిపేట వరకు వచ్చాయని, బండి సంజయ్ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పనులు ముందుకు సాగడం లేదని అన్నారు. వేములవాడ, కొండగట్టు ఆలయాలకు ఒక్క రూపాయి కూడా బండి సంజయ్ తీసుకురాలేదని, ఐదేళ్ల కాలంలో చేసిన పనులపై బండి సంజయ్ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నిస్తూ, చర్చకు సిద్ధంగా ఉంటే వేములవాడలో తామే వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. చేసిన అభివృద్ధి పనులు ఏమీ లేకపోవడంతో బండి సంజయ్ రాముడి పేరిట ఓట్లు అడుగుతున్నారన్నారు కరీంనగర్ స్థానంలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే పోటీ ఉందని, కాంగ్రెస్‌తో ఏ మాత్రమూ పోటీ లేదని అన్నారు. కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థిగా జీవన్ రెడ్డి లేదా ప్రవీణ్ రెడ్డి పోటీ చేయాల్సి ఉండగా, ముక్కు మొహం తెలియని వ్యక్తిని తీసుకొచ్చి నిలబెట్టారన్నారు. కండువా లేకుండా తిప్పాపూర్ బస్టాండ్‌లో కనీసం ఆ పార్టీ కార్యకర్తలు కూడా గుర్తించరని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, జడ్పీ ఛైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు.

● కరీంనగర్‌లో ఓట్లు అడిగే హక్కు నాకే ఉంది..

కరీంనగర్ ఓటర్లను ఓట్లు అడిగే హక్కు తనకే ఉందని బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులు, ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా, న్యాయవాదిగా కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు, అధికారులతో గట్టిగా వాదించి, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ ఇవ్వకుంటే సుప్రీం కోర్టులో కేసు వేస్తానని, 20 లక్షల ఫీజుతో అడ్వకేట్‌ను మాట్లాడానని చెప్పడంతోనే స్మార్ట్‌సిటీ ఇచ్చారని అన్నారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌కు కేంద్రం ఎన్నికొర్రీలు పెట్టినా కేసీఆర్‌ను ఒప్పించి మంజూరు చేయించానని, ఏడాది న్నరలో కరీంనగర్‌కు రైలు వస్తుందని అన్నారు. ఎంపీగా బండి సంజయ్ కుమార్ ఒక్క నవోదయ పాఠశాల తేలేదని, కొండగట్టు, వేములవాడకు ఒక్క రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. కొండగట్టు ఆలయానికి 33 ఎకరాల అటవీ భూమిని ప్రభుత్వంతో ఇప్పించానని అన్నారు. జడ్పీ సమావేశాలకు కూడా హాజరు కానీ ఎంపీ బండిసంజయ్ ధర్మం అంటారని, ధర్మం అంటే అయనకిచ్చిన బాధ్యతను నెరవేర్చడమేనన్నారు. ప్రజలకు ఏమి చేశావని ప్రశ్నించారు.



కరీంనగర్ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్



అలుగునూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

సమస్యలపై ఏనాడైనా పోరాడారా?

- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి చేసిన ఘనత బీజేపీదే
- స్వదేశీ బీజేపీకి.. విదేశీ కాంగ్రెస్‌కు మధ్య జరుగుతున్న పోరాటమిది
- రిజర్వేషన్ల రద్దు కాంగ్రెస్ విష ప్రచారమే
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



హుజూరాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

హుజూరాబాద్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు వినోద్‌కుమార్, రాజేందర్‌రావు ఏనాడైనా ప్రజా సమస్యలపై పోరాడారా అని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. హుజూరాబాద్‌లో ఇంటింటా బీజేపీ పేరుతో ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీజేపీ పార్టీదన్నారు. కరీంనగర్-వరంగల్, సిద్దిపేట, హనుమకొండ నేషనల్ హైవేల అభివృద్ధికి నిధులు తెచ్చిన చరిత్ర తనదన్నారు. ఐదేళ్లలో వేలాది కోట్ల రూపాయలు గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామన్నారు. గతంలో ఎంపీగా ఉన్న వినోద్‌కుమార్ కేసీఆర్ కుటుంబానికి మూటలు మోశాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఈ ఎన్నికల తర్వాత ఐదేళ్ల వరకు వ్యాపారాలు చేసుకుంటారే తప్ప ప్రజలకు కనబడరన్నారు. స్వదేశీ భారతీయ జనతా పార్టీకి... విదేశీయుడు స్థాపించిన కాంగ్రెస్ పార్టీకి మధ్య లోక్ సభ ఎన్నికల పోరు జరుగుతుందన్నారు. బీజేపీని నేరుగా ఎదుర్కొనే దమ్ములేని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీల్లో భయాందోళనలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందడానికి రిజర్వేషన్లను రద్దు చేస్తారంటూ విష ప్రచారం చేస్తోందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే బీజేపీపై బురదజల్లుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తానని కేసీఆర్ ప్రకటిస్తే కనీసం నోరు మెదపలేదన్నారు. అంబేద్కర్‌ను ఓడించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాడి కేసుల పాలైన వ్యక్తి తానన్నారు. తాను పక్కా లోకల్... బీఆర్ఎస్ అభ్యర్థి నాన్ లోకల్ అని, కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల తర్వాత కనబడరన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఓడిపోతామన్న భయంతోనే బీజేపీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. దళితులకు ఏటా 1.25 లక్షల మంది పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించిందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోనే దళితులైన రాంనాథ్‌కోవింద్, ద్రౌపతిముర్మును రాష్ట్రపతులను చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ జిన్నా ఆలోచనలను అమలు చేస్తుందని, సుప్రీం కోర్టు వద్దన్న మతపరమైన రిజర్వేషన్లు తెచ్చి పేదల పొట్ట కొట్టిందన్నారు. రాజ్యాంగాన్ని మార్చేస్తామని కేసీఆర్ ప్రకటిస్తే కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఖండించలేదన్నారు. పోడు భూములపై పోరాడింది బీజేపీ అన్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లను పక్కాగా రద్దు చేసి పేదలకు పంచుతామన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాస్తే కాంగ్రెస్ పార్టీ అవమానించి, ఎన్నికల్లో ఆయనను ఓడగొట్టారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులే మోదీకి ఓటు వేస్తామని బహిరంగంగా చెబుతున్నారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, గంగిశెట్టి రాజు, మాడ గౌతమ్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌చంద్రారెడ్డి, కిషన్, లింగారెడ్డి, రమేష్, వి విజయ్, సంజీవ్, సంజీవరెడ్డి, రాజు, వేణు, కుమార్, ప్రవీణ్, ప్రభాకర్, శశిధర్, కరుణాకర్, ముత్యంరావు, రాజు పాల్గొన్నారు.

ప్రజల కోసం.. ధర్మ రక్షణ కోసం జైలుకు

భగత్‌నగర్: ప్రజల కోసం, ధర్మరక్షణ కోసం జైలుకెళ్లిన చరిత్ర తనదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపి అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని గణేష్‌నగర్‌లో ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం 12 వేల కోట్ల రూపాయలు తీసుకు వచ్చానన్నారు. ప్రజా సమస్యలపై తాను పోరాడనని, మళ్లీ ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను చేసిన పోరాటాలకే కేసీఆర్ ఫాం హౌస్‌ను విడిచి ప్రజల వద్దకు వచ్చానన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం 12 వేల కోట్లు తీసుకు వచ్చానని, చేయాల్సింది ఎంతో ఉందన్నారు. తాను కార్పొరేటర్‌గా ఉన్నప్పుడే ఏడుసార్లు జైలుకెళ్లానన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి స్వేచ్ఛ ఉండేది కాదన్నారు. ఎల్ఐసీ ఏజెంట్ల ఫెడరేషన్ భవన్‌కు ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించడంతోపాటు ఎంపీల్యాడ్స్ నిధులతో ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ భవనాలకు సౌకర్యాలు కల్పించే బాధ్యత తనదన్నారు. కొన్ని పార్టీలు సెక్యులర్ ముసుగులో చేస్తున్న అరచకాలను అడ్డుకుంటామన్నారు. తనను ఎంపీ గెలిపించి ఆదరించాలని కోరారు.



ప్రచార కరపత్రాలను అందిస్తున్న బండి సంజయ్



ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

వైభవంగా మడేలేశ్వరస్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలను ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకెళ్లారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతాలమ్మ- మడేలేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండ



ఈత వనాన్ని పరిశీలిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 28 : గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులో శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిపోయిన తాటి ఈత వనాలతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారి తొలగించిన తాటి చెట్లను ఆదివారం పరిశీలించారు. చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలని గౌడ సంఘం నాయకులకు సూచించారు. కాలిపోయిన సంఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని, నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పీసీసీ రాష్ట్ర నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, యెల్లే లక్ష్మీనారాయణ, వైద్యశివప్రసాద్, గడ్డం నర్సయ్య, వేల్పుల తిరుపతిరెడ్డి, నళినీకాంత్, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, బూర యాదగిరి, గుండ్లపల్లి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు సామల మల్లేశం మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28 : సీపీఐ సీనియర్ నాయకుడు సామల మల్లేశం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు సామల మల్లేశం పార్థివ దేహంపై కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నాడు ఎన్నో కార్మిక పోరాటాలకు మల్లేశం మార్గదర్శకత్వం వహించారని, కార్మిక పక్షపాతిగా క్రియ శీలక పాత్రను పోషించారని అన్నారు. కమ్యూనిస్టు యోధులు నాడు సీహెచ్ రాజేశ్వర్‌రావు, మొన్న తవుటు కనకయ్య, ఈ రోజు సామల మల్లేశం ఒక్కొక్కరిగా మనల్ని విడిచి పెట్టిపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో మల్లేశం మాతో కలసి పనిచేశారని చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా చాలా సార్లు కలుసుకున్నామన్నారు. వారం రోజుల క్రితం కూడా తనకు ఫోన్ చేశారని, కలవడానికి హైదరాబాద్ వస్తానంటే నేనే సిరిసిల్ల వచ్చి కలుస్తానని చెప్పానని తెలిపారు. కానీ ఈ రోజు ఈ విధంగా కలుస్తామని అనుకోలేదన్నారు. సామల మల్లేశం మరణించిన ఈ రోజు సిరిసిల్ల కార్మిక వర్గాలకు చీకటి రోజన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పి ఛైర్ పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడురి ప్రవీణ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ సిద్దోగం వేడుకలు ప్రారంభం



గంభీరావుపేటలో ప్రారంభమైన ఉత్సవాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 28: గంభీరావుపేట మండల కేంద్రంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రేణుకా ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గడ పావన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవంలో భాగంగా లంద వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు సహకరించాలి



కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలు, పక్షుల దాహార్తి తీర్చేందుకు మనవంతు సహకారం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ప్రకటనలో కోరారు. వేసవి కాలం ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యంలో మూగజీవాలు నీటి కోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయని పేర్కొన్నారు. పక్షి జాతుల్లో కొన్ని అంతరించిపోవడానికి వేసవి కూడా ఒక కారణమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో పక్షులు, పశువుల దాహార్తి తీర్చడానికి సహకరించాలని కోరారు. ఇంటి ప్రాంగణాల్లో గిన్నెల్లో నీళ్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలోని పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులు, పక్షుల సంరక్షణకు కావాల్సిన ఆహారం, నీళ్లు, ఇతర వైద్య సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అదే విధంగా పశువుల సంక్షేమ సంస్థలు, జంతు ప్రేమికులు వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతీ ఇంటి ముందు నీటిని ఉంచే ఏర్పాట్లు చేయాలని కోరారు.

నేడు వస్త్ర ఉత్పత్తులపై వర్క్‌షాప్

సిరిసిల్ల రూరల్ ఏప్రిల్ 28: సిరిసిల్ల పట్టణంలో వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లపై హైదరాబాద్ పత్తర్ ఘట్‌కు చెందిన వ్యాపారులు సోమవారం వర్క్‌షాప్ ఏర్పాటు చేయనున్నట్లు వ్యాపారులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శివనగర్ శివాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పట్టణంలోని మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐ యూనిట్లు ఆసాములు, యజమానులు పరిశీలించి వస్త్ర ఆర్డర్లను పొందాలని, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల చర్యలు

- 256 మంది యువకులకు కౌన్సెలింగ్
- 81 ద్విచక్రవాహనాలు సీజ్



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 28: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రోడ్లపై అనవసరంగా తిరుగుతున్న 256 మంది యువకులను పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరు వినియోగించిన దాదాపు 81ద్విచక్రవాహనాలను సీజ్‌చేశారు. యువకులు అర్ధరాత్రి వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద, వీధుల్లో, రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై గుంపులు గుంపులుగా యువకులను అదుపులోకి తీసుకున్నారు. కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. యువకులు భవిష్యత్‌ని నాశనం చేసుకోవద్దని, చెడు వ్యసనాలకు అలవాటు పడవద్దని అన్నారు. పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇకనుంచి జిల్లాలో తరుచుగా ఆపరేషన్ చబుత్రా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అర్ధరాత్రి12 గంటల తర్వాత రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనవసరంగా గుంపులు గుంపులుగా యవకులు తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే వారిపై న్యూసెన్స్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదుచేస్తామన్నారు. యువత చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే వారి మంచి భవిష్యత్‌ను కోల్పోతారన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాత్రి వేళ రోడ్లపై అనవసరంగా తిరిగితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. ఆపరేషన్ చబుత్రాలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి రహదారులపై తిరుగుతున్న యువకులను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఠాణాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి పూట యువకులు మద్యం మత్తులో రోడ్లపై తిరగవద్దన్నారు. కారణం లేకుండా బయట కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధిక శబ్దంతో వాహనాలను నడపడం, రోడ్లపై పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం వంటివి చేయొద్దన్నారు. నిత్యం రాత్రి వేళ పోలీసులు గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తారన్నారు. కేసుల పాలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకూడదని సూచించారు. మండలంలో మొత్తం 44 మంది యువకులను అదుపులోకి తీసుకుని అవగాహన కల్పించామని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మానకొండూర్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఆదివారం మానకొండూర్‌లో సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. తూర్పు దర్వాజ బస్టాండ్ వద్ద జమ్మికుంట నుంచి కరీంనగర్ వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహక రించాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు డబ్బు తీసుకెళ్తున్న వారు ఆధారాలు ఉంచుకోవాలని చెప్పారు. 50వేల రూపాయలకు మించి తీసుకెళితే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వాహనదారుడి మృతి


హేమంత్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 28: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి సంతోష్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెరుక హేమంత్(22) మృతి చెందాడు. శనివారం అర్ధరాత్రి బస్సుకు హైద్రాబాద్‌కు వెళ్లాల్సిన మిత్రుడికి వీడ్కోలు పలికేందుకు హేమంత్ మిత్ర బృందం షిర్కే బస్టాప్‌కు వెళ్లారు. అక్కడ వేరే మిత్రుడి వాహనాన్ని తీసుకున్న హేమంత్, మణికంఠలు సంతోష్‌నగర్ వైపు వెళ్లారు. ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కరెంట్ పోల్‌ను బలంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో హేమంత్ తల, మొహంపై బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనకాల ఉన్న మణికంఠ గాయపడ్డాడు. కాగా 25 రోజుల క్రితమే హేమంత్ సింగరేణిలో ఉద్యోగం సాధించాడు. కారుణ్య నియామకాల కింద హేమంత్ తండ్రి శంకర్ మెడికల్ ఇన్వాలిడేషన్ అవడంతో యాజమాన్యం 25 రోజుల క్రితం వకీల్‌పల్లె గనిలో పోస్టింగ్ ఇచ్చింది.

హార్వెస్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులో శనివారం రాత్రి హార్వెస్టర్ ఢీకొన్న సంఘటనలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన గాజులపల్లి ముత్యం తీవ్ర గాయాలపాలయ్యాడని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన మహారాష్ట్రకు చెందిన హార్వెస్టర్ డ్రైవర్ రాంనేని రాజబాపుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ముత్యం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బొప్పాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న హార్వెస్టర్ ముత్యం బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు.

కాగితాలకే పరిమితమైన అటవీ ప్లాంటేషన్

- ప్లాంటేషన్ లేకున్నా మొక్కలు కాపాలాదారు..?
- అధికారి తీరుతో ప్రభుత్వ ఖజానా పక్కదారి?

కోనరావుపేట, ఏప్రిల్ 28: కోనరావుపేట మండలం శివంగలపల్లి బీట్ పరిధిలో అటవీ ప్లాంటేషన్ కాగితాలకే పరిమితమైందనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారి తీరుతో ప్రభుత్వ ఖజానా పక్కదారి పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. నాటిన మొక్కలను సంరక్షించకపోయినా సంరక్షిస్తున్నట్టు ఉన్నతాధికారులను నమ్మిస్తూ కాగితాలకే ప్లాంటేషన్‌ను పరిమితం చేసి ప్రభుత్వం నుంచి నిర్వహణ ఖర్చు చేస్తున్నామని బిల్లులు తీసుకుంటూ, వాచ్‌మన్ పేరు మీద బిల్లు పొందుతూ ఓ అటవీశాఖ అధికారి నిధులు కాజేస్తున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోనరావుపేట మండలం శివంగలపల్లి బీట్ పరిధిలో 2022-23 సంవత్సరంలో కంపార్ట్మెంట్ నెంబర్ 176/3లోని 41 హెక్టార్లను ప్యాచ్ 1 ప్యాచ్ 2 ప్యాచ్ 3 మూడు భాగాలుగా ఏర్పాటు చేసి అందులో సుమారు 11 వేల మొక్కలను అటవీశాఖ అధికారులు నాటారు. కానీ అందులో నాటిన ఏ ఒక్క మొక్కను కూడా అధికారులు సంరక్షించలేదు. అందులో లేని మొక్కలు ఉన్నాయంటూ వాటి నిర్వహణకు ఖర్చులు ప్రభుత్వం నుంచి పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మొక్కలు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేశాం

- బాపు రాజు, వెంకటాపూర్, సెక్షన్ అధికారి



ఫారెస్టు పరిధిలోని 25 ఎకరాల్లో ప్లానిటేషన్ చేశాం. కొంత మంది భూములు ఆక్రమించుకుంటూ ఇవి మా భూములేనని పెట్టిన మొక్కలను ధ్వంసం చేశారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేశాం. ఆ భూములను కాపాడడానికి వాచర్‌ను నియమించాం. ప్రతి సంవత్సరం మొక్కలు నాటుతున్నాం. కొంత మంది భూమిని ఆక్రమించుకు నేందుకు ప్రయతిస్తూ మొక్కలను ధ్వంసం చేస్తున్నారు.


మొక్కలు నాటినట్లు చూపుతూ ఏర్పాటు చేసిన బోర్డు

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి

వేములవాడ, ఏప్రిల్ 28: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, శ్రీ భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పీడీఎస్‌యూ రాష్ట్రకోశాధికారిగా రత్నం రమేష్ ఎన్నిక


రత్నం రమేష్

భగత్‌నగర్, ఏప్రిల్ 28: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర కోశాధికారిగా రత్నం రమేష్ ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో ఈ నెల 27న జరిగిన పిడిఎస్‌యు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రత్నం రమేష్‌ను రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రత్నం రమేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి సంఘం పట్ల అంకిత భావంతో విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేసి సమస్యల పరిష్కారానికి, సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

సీపీఐ నాయకుడు సామల మల్లేశం మృతి

- సంతాపం తెలిపిన వివిధ పార్టీల నాయకులు


సామల మల్లేశం(ఫైల్)

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28: కార్మికవర్గం పక్షాన అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలు చేసిన సీపీఐ సీనియర్ నాయకుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం(80)వృద్ధాప్యం, అనారోగ్యంతో కన్నుమూశాడు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీవై నగర్ స్వగృహంలో మల్లేశం పార్థీవదేహం ఉంచారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరమారావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు సంతాపం తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి సీపీఐ పార్టీ జెండా, పూలమాలలను మల్లేశం పార్థీవదేహంపై ఉంచి నివాళులర్పించారు. పవర్‌లూం, బీడీ పరిశ్రమకు నిలయమైన సిరిసిల్లలో మూడు దశాబ్దాల పాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మల్లేశం పోరాటాలు చేశారని వారు పేర్కొన్నారు. సిరిసిల్ల రాయిని చెరువులో వేలాది మంది నిరుపేదలను సమీకరించుకొని పోరాటాలు చేసి వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించారన్నారు. మల్లేశం మరణం సీపీఐ పార్టీకి తీరని లోటని అన్నారు. మల్లేశంకు భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాల జాతర


జగ్గసాగర్‌లో నృత్యాలు చేస్తున్న పోతరాజులు


అప్పారావుపేటలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో పోచమ్మ బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు అమ్మ వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేశారు. బోనాలను నెత్తిన ఎత్తుకొని పోతురాజుల నృత్యాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయంకు చేరుకున్నారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలోగౌడ కులస్థులు, భక్తులు పాల్గొన్నారు.

● కొడిమ్యాల: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ఆదివారం పెద్దమ్మ బోనాల పండగను ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ఇంటికొక్క బోనం నెత్తిన పెట్టుకొని ఆలయానికి డప్పు చప్పుళ్లతో వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లా పాపలను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు గరిగంటి పర్వతాలు, ఎడ్ల కొమురయ్య, గరిగంటి మహిపాల్, మహేష్, గ్రామ మాజీ సర్పంచ్ గరిగంటి మల్లేశం, ముదిరాజు సంఘం సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

- బొప్పాపూర్‌కు చెందిన మహిళ మృతి ● భర్తకు తీవ్ర గాయాలు


నీతిరెడ్డి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మహిళ నీతిరెడ్డి(40) అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. భర్త సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన సురేశ్ తన భార్యాపిల్లలతో కలిసి ఇటీవల హైదరాబాద్‌లో స్థిర పడ్డారు. భార్య నీతిరెడ్డి, కూతురు సమీక్ష ఉన్నారు. సురేశ్, దీప్తి దంపతులు తమ కూతురు సమీక్షను ఇంటి వద్ద ఉంచి నిర్మల్ జిల్లాలోని బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యానికి కారులో బయలుదేరారు. డిచ్‌పల్లి సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడడంతో నీతిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందింది.భర్త సురేశ్ తీవ్ర గాయాలతో బయట పడ్డాడు. నీతిరెడ్డి ప్రమాదంలో మృతిచెండంతో గ్రామంలో విషాదం నెలకొంది.

సౌదీ ప్రమాదంలో ఒకరి మృతి

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం


మహమ్మద్ నబీ(ఫైల్)

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 27: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ నబీ(53)సౌదీ అరేబియాలో ప్రమాదవశాత్తూ మృతిచెందగా మృతదేహం ఆదివారం స్వగామానికి చేరింది. నబీ గత కొన్ని రోజుల క్రితం సౌదీ అరేబియాలో ప్రమాద ఘటనలో మృతి చెందంగా గల్ఫ్ అవగాహన వేదిక చొరవతో మృతదేహం మాదాపూర్ గ్రామానికి చేరుకుంది. నబీ ఉపాధి కోసం కొన్ని సంవత్సరాల క్రితం గల్ఫ్‌కు వెళ్లాడు. గత నెల 30వ తేదీన నబీ పనిచేస్తున్న కంపనీలో ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహం స్వగ్రామం రప్పించడానికి నబీ తమ్ముడు మహమ్మద్ జావిద్ గల్ఫ్ కార్మిక అవగాహన సభ్యులైన ఫరూకు, అబ్బుల్ రఫీక్‌లను సంప్రదించడంతో వారు ఇండియన్, సౌదీ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మృతదేహం స్వగ్రామానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. కాగా నబీకి భార్య సరీఫాతోపాటు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

క్రీడా ప్రాంగణంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 17: ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనువైన ప్రదేశంలో స్థలాలు లేకపోవడంతో క్రీడా ప్రాంగణంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆడుకునేందుకు యువకులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరు తున్నారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాల నిర్వహణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.



సుద్దాలలో క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

ధాన్యం కుప్పలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- మాజీ సర్పంచ్‌కు గాయాలు

చందుర్తి ఏప్రిల్ 28: రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలపైకి ఓ ట్రాక్టర్ దూసుకెళ్లి బోల్తా పడడంతో డ్రైవింగ్ చేస్తున్న మాజీ సర్పంచ్‌కు తీవ్ర గాయాలైన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. చందుర్తి మండల కేంద్రంకు చెందిన మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం చందుర్తి నుంచి ట్రాక్టర్‌పై మోత్కరావుపేటకు వెళుతుండగా చందుర్తి శివారులోని రైతు వేదిక వద్ద రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న మల్లేశంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మల్లేశంను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుగుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నమెంట్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసోసియేషన్ బాధ్యులు


ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 28: గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. మెదక్, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోటీలో కరీంనగర్ జట్టు విజయం సాధించగా, ఆదిలాబాద్ నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది. ఖమ్మం, ఆదిలాబాద్ జట్ల మధ్య జరిగిన పోటీలో ఆదిలాబాద్ జట్టు విజయం సాధించింది. వనపర్తి, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది.

నిజామాబాద్, కరీంనగర్ మధ్య జరిగిన పోటీల్లో కరీంనగర్ జట్టు విజయం విజయం సాధించింది. టోర్నమెంట్ కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, వైస్ ప్రెసిడెంట్ నాయుడు, కోశాధికారి సామల సత్యానారాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


బుర్ర రాజమ్మ(ఫైల్)

ఎలిగేడు, ఏప్రిల్ 28: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బుర్ర రాజమ్మ(108) ఆదివారం మృతి చెందారు. ఆమె భర్త బుర్ర లస్మయ్య 35ఏళ్ల క్రితం మృతిచెందాడు. రాజమ్మకు చనిపోయే వరకు షుగర్, బీపీ ఇతరత్రా వ్యాధులు లేకుండా ఆరోగ్యంగా ఉన్నారు. ఆదివారం చనిపోగా గ్రామస్థులు తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు.

క్రేన్ బావిలో పడి కూలీ మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 28: బావిలో పూడిక తీత పనుల్లో ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడడంతో ఓ కూలీ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలో ఆదివారం ఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ మారుతి కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన అంజయ్య అనే రైతు తన వ్యవసాయబావిలో పూడిక తీత కోసం మండలంలోని ఫాజుల్‌నగర్‌కు చెందిన దండుగుల కొమురయ్యకు కాంట్రాక్టు ఇచ్చాడు. ఆదివారం యాదావిధిగా బావిలో నుంచి మట్టి తీసే క్రమంలో బావి పక్కనే ఉన్న క్రేన్‌తో పాటు క్రేన్ నడుపుతున్న దండుగుల మల్లవ్వ(70), దేవయ్యలు బావిలో పడిపోయారు. మల్లవ్వకు తీవ్ర గాయాలు కాగా అక్కడే మృతి చెందింది. దేవయ్యకు స్వల్ప గాయాలు కాగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. కుమారుడు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ మారుతి పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన మల్లవ్వ మృతదేహంను తీసేందుకు పోలీసులు ప్రత్యేకంగా క్రేన్ ఏర్పాటు చేసి బావిలో నుంచి మృతదేహంను బయటకు తీశారు. క్రేన్‌తో పాటు మల్లవ్వ బావిలో పడే సమయంలో బావిలో కొమురయ్య, గంగమణి ఉన్నట్లు బాధితులు తెలిపారు. మల్లవ్వ కుమారుడు, కోడలు కలిసి బావిలు గుత్తకు పట్టుకుని జీవిస్తుంటారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహంను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రచారానికి భానుడి ఎఫెక్ట్

- ఉదయం వేళల్లోనే ముఖ్య నాయకుల ప్రచారాలు
- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో కనిపించని సందడి
- జిల్లాలో 43.3 గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- కొనసాగుతున్న ఆరెంజ్ అలర్ట్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో లోక్‌సభ ఎన్నికల సందడికి ఎండలు బ్రేక్ వేస్తున్నాయి. ఎండ సెగకు ప్రచారంలో తిరగడానికి కార్యకర్తలు జంకుతున్నారు. దీంతో రెండు నియోజకవర్గాల్లో ముఖ్య నాయకులు ఉదయం వేళల్లోనే ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ప్రచారాలు నామమాత్రంగా సాగుతుండగా ప్రచార రథాలు మాత్రమే తిరుగుతున్నాయి. పోలింగ్ తేదీకి కౌంట్‌డౌన్ మొదలవడంతో పార్టీల మధ్య రాజకీయ వేడి మొదలైనా సూర్యుడి వేడితో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రచారం కనిపిస్తోంది. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు బీజేపీ, బీఆర్ఎస్ రోడ్‌షోలు, సమావేశాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రచార వేగం ఇంకా పెరగలేదు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులకు మార్గనిర్దేశనం చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సిరిసిల్ల, వేములవాడలో క్లస్టర్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సమావేశాలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల హడావుడి మాత్రం ఎండ వేడికి పుంజుకోవడం లేదు. ఎండల ప్రభావంతోనే ప్రచారానికి సమయం దొరకడం లేదని ఆయా పార్టీల నాయకులే చెబుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో 4.72 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2.46 లక్షలు, వేములవాడ సెగ్మెంట్‌లో 2.25 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టగా వేములవాడ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారాలు మొదలైనా క్షేత్రస్థాయిలో సాధారణ కార్యకర్తలు మాత్రం ఎండవేడికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.



● జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ప్రతీ రోజు 40 డిగ్రీలకు పైగానే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

జిల్లాలో ఉష్ణోగ్రతలు

మండలం	ఉష్ణోగ్రత స్టేషన్	గరిష్ఠం
కోనరావుపేట	మర్తనపేట	43.3
సిరిసిల్ల	పెద్దూర్	42.9
బోయినపల్లి	బోయినపల్లి	42.9
తంగళ్లపల్లి	నేరెళ్ల	42.6
ముస్తాబాద్	నామాపూర్	42.3
సిరిసిల్ల	కలెక్టరేట్	42.2
వీర్నపల్లి	వీర్నపలి	42.2
వేములవాడ రూరల్	వట్టెంల	41.9
వేములవాడ	నాంపల్లి	41.8
ఇల్లంతకుంట	పెద్దలింగాపూర్	41.7
రుద్రంగి	మానాల	41.6
ముస్తాబాద్	అవునూర్	41.6
ఎల్లారెడ్డిపేట	ఎల్లారెడ్డిపేట	41.6
గంభీరావుపేట	గంభీరావుపేట	41.4
గంభీరావుపేట	గజసింగవరం	41.4
ఇల్లంతకుంట	ఇల్లంతకుంట	40.9
వేములవాడ రూరల్	మల్లారం	40.8
చందుర్తి	మర్రిగడ్డ	40.8
కోనరావుపేట	నిజామాబాద్	40.5
రుద్రంగి	రుద్రంగి	39.7

శనివారం జిల్లా వ్యాప్తంగా ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఆదివారం రుద్రంగి మండలంలోని రెండు వెదర్ స్టేషన్‌లలో రుద్రంగి వెదర్ స్టేషన్ మినహా అన్ని స్టేషన్‌లలో ఆరెంజ్ అలర్ట్‌గానే నమోదైంది. జిల్లాలో కనిష్ఠంగా 24.7, గరిష్ఠంగా 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఎండ తీవ్రతకు ర్యాలీలు, నిర్వహించడానికి నాయకులు వెనకడుగు వేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, ఎండదెబ్బకు గురైతే ఇబ్బంది కలుగుతుందనే భయం కూడా పార్టీ నేతల్లో నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రచార రథాలతోనే సరిపెడుతున్నారు.

పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణోత్సవం



విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 28 : తంగళ్లపలి మండలం సారంపల్లిలో ఆదివారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం నాయకుడు మునిగల్ అంజయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు, జిల్లా సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మోర రాజు, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్ , సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చుక్క శేఖర్, నగరం సత్యానారాయణ రెడ్డి, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, సత్తు శ్రీనివాస్ రెడ్డి, కటకం రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్ పూజలు



వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్

తంగళ్లపలి మండలం సారంపల్లిలో ఆదివారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు కేటీఆర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుల ఉమ, తోట ఆగయ్య, ఎంపీపీ పడిగెల మానస రాజు, గజభీంకర్ రాజన్న, బండి దేవదాస్, కోడూరి భాస్కర్ గౌడ్, కోడి అంతయ్య, సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, కొయ్యడ రమేష్, గుగ్గిళ్ళ ఆంజనేయులు, బండి జగన్ ముదిరాజ్ సంఘం నాయకుడు పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28 : మే 1 నుంచి నిర్వహించ తలపెట్టిన పోలీస్ సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, చిత్రలేఖనం, అబాకస్, కరాటే, యోగా, డ్యాన్స్ తదితర విభాగాల్లో ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 29 వరకు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 8712656373, 8712656374 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు వారి నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు సోమవారం చివరి రోజని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకునే వారు నిర్ణీత నమూనాతో కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత నామినేషన్ల ఉపసంహరణకు వచ్చే దరఖాస్తులను ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం అనుమతించబోమని స్పష్టం చేశారు. నామినేషన్లను ఉపసంహరించుకునే వారు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 28: కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని ఇంటింటికి వెళ్లి వివరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన బొల్లం శ్రీనివాస్‌ను గ్రామ అధ్యక్షుడిగా నియమించి ఆదివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. ఎంపీ ఎన్నికలలో రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించడానికి నిరంతరం పని చేయాలన్నారు. కొన్నిపార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికారప్రతినిధి పసుల వెంకటి, నాయకులు బడుగు లింగం, మచ్చ రాజేశం, అశోక్, చంద్రమౌళి, వెంకటేశం, వెంకటరాంరెడ్డి, చుక్కరెడ్డి, ఆది మల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: బీఆర్ఎస్, బీజేపీ రైతు, ప్రజా వ్యతిరేక పార్టీలని, ఆ రెండు పార్టీలకు ఓటు అడిగే అర్హత లేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పార్టీల నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావును ప్రకటించగానే బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు సంజయ్‌కుమార్, వినోద్‌కుమార్‌లు సహనం కోల్పోయి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే గత బీఆర్ఎస్ సర్కారు అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. ఈ నెల 29న సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో రోడ్ షో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మంత్రి ప్రభాకర్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ పాల్గొంటారన్నారు. రోడ్ షోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, కృష్ణమూర్తి, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, నర్సయ్య, రాజ్‌కుమార్, బుచ్చాగౌడ్, రాములు, రాజునాయక్ పాల్గొన్నారు.

సందవేణి మల్లేశం యాదవ్‌కు సన్మానం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28 : రాజన్న సిరిసిల్ల జిల్లా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా నియామకమైన సందవేణి మల్లేశం యాదవ్‌ను ఆదివారం సిరిసిల్లలో యాదవ్ సంఘం జిల్లా నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల భాస్కర్ యాదవ్, నాయకులు గొట్ల ఐలయ్యయాదవ్, ఆత్మకూరు చంటియాదవ్, తంగళ్లపల్లి మండల గౌరవ అధ్యక్షుడు బండి దేవేందర్‌యాదవ్, మండల కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్‌యాదవ్, చెనవేణి తిరుపతియాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మాజీ సర్పంచ్ రాజీనామా

వేములవాడ టౌన్, ఏప్రిల్ 28 : వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ ఇటిక్యాల నవీనరాజు బీఆర్ఎస్‌కు ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా నవీన రాజీనామా పత్రాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'ఫీజుల దోపిడీపై ఆందోళనలు నిర్వహిస్తాం'

భగత్‌నగర్, ఏప్రిల్ 28: ప్రైవట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీపై ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహిస్తామని భారత్ ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు సందగణేష్ అన్నారు. ఆదివారం నగరంలోని ముకరంపురలోని జిల్లా కార్యాలయంలో నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజులు పెరగడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువులకు దూరమతున్నారన్నారు. సమావేశంలో కుమార్, నవీన్, తిరుపతి, మహేష్, అఖిల్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కందికట్కూర్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు



వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 28: మండలంలోని కందికట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. పాఠశాలలో 2006-2007 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

వేములవాడ టౌన్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. శాత్రాజుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఎంఈవో రాజేందర్‌శర్మ, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, కిషన్, అరుణ, శ్రీనివాస్, ఆనందచారి, వెంకటరమణ, భాస్కర్, మంజుల, రాంప్రసాద్ పూర్వ విద్యార్థులు మమత, ఆకాంక్ష, పద్మ, స్వప్న, గౌతమి, రజిత, శారద, ఆమని, నరేష్, సంతోష్, శివ, ప్రమోద్, కిషన్, శ్రావణ్, వెంకటేష్, పరుశురాములు, బాబు, అంజాద్, హరీష్ ఉన్నారు.

ప్రధాని మోదీ నల్లధనాన్ని వెలికి తీయలేదు

చందుర్తి, ఏప్రిల్ 28: పది సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ నల్లధనాన్ని వెలికి తీస్తనని చెప్పారని, ఇప్పటి వరకు వెలికి తీయలేదని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం దేవునితండా, సనుగుల, రామరావుపల్లి, కిష్టంపేటలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పేదవాడి జన్ ధన్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి 15 పైసలు కూడా వేయలేదని, ప్రజలను మోసం చేసిన మోదీకి ఎందుకు ఓట్లు వేయలాని అన్నారు. ఎన్నికలు రాగానే బీజేపీ నాయకులు మతం పేరుతో రాజకీయాలు చేస్తారని, త్రేతా యుగంలోని రాముడితో బీజేపీ వారికి ఏం సంబంధమని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాల ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏ విధంగానైతే గద్దెదించారో, నేడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. జడ్పీటీసీ నాగం కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపటంటి రామస్వామి, నాయకులు మ్యాకల గణేష్, ముస్కు ముకుందరెడ్డి, భీమారాజు కనకరాజు, బొజ్జ మల్లేశం, ముస్కు పద్మ, బాణాల రవిందర్‌రెడ్డి, గంగారెడ్డి, వెల్పుల దేవస్వామి, గొట్టె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను నమ్మవద్దు



గిరిజనులతో మాట్లాడుతున్న రవీందర్‌రావు

వీర్నపల్లి, ఏప్రిల్ 28 : అబద్ధపు హామీలు ఇస్తున్న కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను నమ్మవద్దని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండాలో ఆదివారం గిరిజనులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడ్డాక అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. గతంలో 40 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు అభివృద్ధి చేయలేదని, ఇప్పుడు అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేయాలని చూస్తోందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మారుమూల గ్రామాలను అభివృద్ధి చేయలేదన్నారు. అబద్ధపు హామీలు ఇస్తున్న కాంగ్రెస్, బీజేపీని ప్రజలు గమనించాలని కోరారు. ఒకప్పుడు సాగునీరు లేక వలసలు వెళ్లిన రాష్ట్రంలో ఇప్పుడు ధాన్యం రాశులు పండిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మరోసారి లోక సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆదరించి ఆశీర్వదిస్తే ప్రజలను కడుపులో పెట్టి కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ మాలోతు భూల, పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు గుగులోతు కళ, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, మండల మహిళా ప్రధాన కార్యదర్శి సరిత, మాజీ సర్పంచులు ఎడ్ల సాగర్, శ్రీనివాస్ నాయక్, రవి నాయక్, నాయకులు సంతోష్, రఫీ పాల్గొన్నారు.

గీత కార్మికులను ఆదుకోవాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 28: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిపోయిన తాటి, ఈత వనాలపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులోని తాటి, ఈత వనం శనివారం ప్రమాదవశాత్తు కాలిపోయింది. ఆదివారం వేములవాడ పర్యటనకు వెళ్తుండగా కేటీఆర్ మార్గం మధ్యలో ఉన్న రగుడు శివారులో కాలిపోయిన తాటి ఈత వనాన్ని పరిశీలించారు. వాటిపై ఆధారపడిన చాలామంది గీత కార్మికుల ఉపాధి లేకుండా పోయిందని గీతాకార్మికులు మొరపెట్టుకోవడంతో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కాలిపోయిన చెట్లకు నష్టపరిహారంతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుడూరి ప్రవీణ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు గుగ్గిళ్ల అజయ్‌గౌడ్, బూర కమలాకర్, బూర విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఫ్లెక్సీలో చెన్నమనేని ఫొటో మాయం



చెన్నమనేని ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వేములవాడ, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆదివారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ కార్యకర్తల సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ ఫొటో మాయమైంది. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశం సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, వేములవాడ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు ఫొటోలు మాత్రమే ముద్రించారు. 2010 సంవత్సరం నుంచి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతగా, ఎమ్మెల్యేగా కీలకంగా వ్యవహరించి, గత ఎన్నికలలో పార్టీ టికెట్ తిరస్కరణకు గురైన చెన్నమనేని రమేష్ ఫొటోను ఫ్లెక్సీలో ముద్రించలేదు. వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై చెన్నమనేని ఫొటో లేకపోవడం చర్చనీయాంశం కాగా, ఇక బీఆర్ఎస్ పార్టీతో చెన్నమనేని బంధం దాదాపుగా ముగిసినట్లేనని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మానకొండూర్, ఏప్రిల్ 28: మండలంలోని లలితాపూర్ గ్రామంలోని మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో పట్నాల కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నల్లంగి ఐలయ్య, మారం ఐలయ్య, ఉపాధ్యక్షులు డైరెక్టర్లు మర్రి లచ్చయ్య, దాడి సంపత్, మర్రి కొమురయ్య, దాడి లింగయ్య, మదుగాని భూమయ్య, దాడి మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా.. మహాలక్ష్మి రథోత్సవం

ధర్మపురి, ఏప్రిల్ 28: మహాలక్ష్మి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అర్చకులు కొరిడె బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో పలు వీధుల్లో రథాన్ని ఊరేగించారు. పెద్ద ఎత్తున మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. అంతకు ముందు ధర్మపురి ఆలయం పక్షాన గోదావరి నది వద్ద గల దేవస్థానమునకు ముత్యాల తలంబ్రాలు, ప ట్టువస్త్రాలు ప్రతి సంవత్సరము వలె ఈ యేడాది కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, వేదపండితులు ముత్యాల శర్మ, నంబి నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం

- ఉచిత ప్రయాణమని విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఆవేదన

గన్నేరువరం, ఏప్రిల్ 28: ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. బస్‌స్టాప్‌లో విద్యార్థులు, మహిళలు నిలబడి ఉన్నా వారిది ఉచిత ప్రయాణమని సిబ్బంది పట్టించుకోకపోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి ఆదివారం ఇంటర్ గురుకుల ఎంట్రన్స్ ఎగ్జాం కోసం కరీంనగర్ వెళ్లేందుకు ముగ్గురు విద్యార్థులు ఉదయం బస్సు కోసం రోడ్డు పక్కన వేచి చూస్తున్నారు. బస్సు రావడంతో ఆపమని చేతులు ఎత్తారు. డ్రైవర్ వీరిని గమనించినప్పటికీ బస్సును ఆపకుండా నిర్లక్ష్యంగా ముందుకు వెళ్లిపోయాడు. పరీక్షకు హాజరుకావాలన్న ఆత్రుతతో విద్యా ర్థులు బస్సు వెనకాల కొద్ది దూరం పరిగెత్తారు. మరో వ్యక్తి బస్సును వెంబడించి బస్సును ఆపించాడు. దీంతో విద్యార్థులు బస్సులో ఎక్కారు. ఉచిత ప్రయాణం చేస్తున్నారనే విద్యార్థులు, మహిళలను సిబ్బంది పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



వెంకటాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, పదిర, హరిదాస్‌నగర్ తదితర గ్రామాల్లో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, బుగ్గారెడ్డి, రాజిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, కిరణ్‌నాయక్, లక్ష్మారెడ్డి, బాలయ్య, సత్యంరెడ్డి, రామచంద్రారెడ్డి, దేవయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాలలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రేపాక, దాచారం, పెద్దలింగాపూర్, కందికట్కూర్, పొత్తూర్ తదితర గ్రామాలలో ఎంపీ ఎన్నికలలో బండి సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రొండ్ల మధుసూదన్‌రెడ్డి, గుంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి: బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పని చేయాలని శక్తి కేంద్రం ఇన్‌చార్జి పిట్ల నాగరాజు అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా కరపత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. బూత్ అధ్యక్షుడు మాడుగుల లింబాద్రి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



సిరిసిల్లలో ప్రచారం చేస్తున్న చైర్ పర్సన్

సిరిసిల్ల టౌన్/ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బండలింగంపల్లి, నారాయణపూర్, దుమాల, తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో బీజేపీ ఎంపీ సంజయ్‌కుమార్ ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటు పడిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పల్లెలు ప్రగతిని సాధించడంతోపాటు సబ్బండ వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు దరి చేరాయని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను అత్యధికగా మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి ప్రారంభించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం విద్యానగర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో చైర్ పర్సన్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం గడపగడపకు బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మూడో వార్డు నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిచాలని, పార్టీ కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేయాలని అన్నారు. సిరిసిల్ల పట్టణం 17వ వార్డు గాంధీనగర్‌లోని భక్తాంజనేయ రుక్మిణి విఠలేశ్వర కాళభైరవ స్వామి దేవాలయంలో వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజపూర్ణచందర్ ప్రత్యేక పూజలను చేసి ఇంటింటికి ప్రచారం ప్రారంభించారు. 37వ వార్డులోని అంబబాయి దేవాలయంలో వార్డు కౌన్సిలర్ దిడ్డి మాదవిరాజు ప్రత్యేక పూజలను నిర్వహించి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం ప్రారంభించారు.